సాక్షి ఆదిలాబాద్

బుధవారం। 31 । జూలై। 2024

జాబ్‌మేళాకు స్పందన

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన లభించింది. స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పలు ఉద్యోగాల ఎంపిక కోసం నిర్వహించిన మేళాకు నిరుద్యోగ అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. ఎంప్లాయ్‌మెంట్ అధికారి మిల్కా పర్యవేక్షించి అభ్యర్థులకు సూచనలు చేశారు.

బల్దియా ఏఈ అరుణ్ బదిలీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ ఏఈగా పనిచేస్తున్న పి.అరుణ్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయనను నిర్మల్ ప్రజారోగ్య విభాగానికి బదిలీ చేస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ ఇన్ చీఫ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఆయన స్థానంలో ఇంకా ఎవరికి పోస్టింగ్ ఇవ్వలేదు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/20.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: జిల్లాలోని ఆయా కేజీబీవీల లో నాన్‌టీచింగ్ పోస్టులైన ఆఫీస్ సబార్డినేట్, డేనైట్ వాచ్ ఉమెన్, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్ పోస్టుల భర్తీకి గాను దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ అర్బన్, బజార్‌హత్నూర్, బేల, బోథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, తలమడుగు కేజీబీవీలలో ఒకటి చొప్పున నైట్ వాచ్ ఉమన్, జైనథ్ కేజీబీవీలో డే వాచ్ ఉమన్, నేరడిగొండ కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ రెండు, కేజీబీవీ బోథ్‌లో ఒక అటెండర్, కేజీబీవీ తాంసిలో ఒక స్కావెంజర్ పోస్టులు ఖాళీలు ఉన్నట్లుగా పేర్కొన్నారు. ఆసక్తి, అర్హులైన మహిళా అభ్యర్థినులు ఆగస్టు 1వరకు సంబంధిత మండల విద్యాధికారి కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పోస్టులకు ఎంపికైన వారికి రూ.9,750 ప్రోత్సాహకం అందించనున్నట్లు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



టైర్లలో నీటిని పారబోయిస్తూ..

ఎదులాపురం: సీజనల్ వ్యాధుల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కేఆర్‌కే కాలనీని మంగళవారం సందర్శించారు. కాలనీలో డెంగీ పాజిటివ్ కేసులు నమోదైన నేపథ్యంలో పరిసరాలను పరిశీలించారు. పాత టైర్లు, నీటి తొట్టెలలో నిలిచిన నీటిని సిబ్బందితో పారబోయించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది రఘునాథ్, సురేశ్, సబనాజ్, అరుణ్, ఆశా వర్కర్లు ఉన్నారు.

విద్యార్థులకు మరింత పోషకాహారం



తిథి భోజనాన్ని ప్రారంభిస్తున్న డీఈవో

తలమడుగు: 'తిథి' కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మరింత పోషకాహారం అందుతుందని డీఈవో ప్రణీత అన్నారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన తిథి భోజన కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమాజ భాగస్వామ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అదనంగా పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అయితే ఇలాంటి కార్యక్రమం పాఠశాలలో ఏడాదిగా కొనసాగడం అభినందనీయమన్నారు. అనంతరం పదోతరగతి విద్యార్థులకు పలు సూచనలు అందించారు. విద్యార్థులను న్యాస్ పరీక్షకు సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శ్రీకాంత్‌గౌడ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణకుమారి, ప్రత్యూష, ఆర్పీలు శంకర్, నగేష్, సంతోష్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాఫీ.. గగ్గోలు!



ఇతను బజార్‌హత్నూర్‌కు చెందిన రైతు డి.గంగాధర్. గ్రామ శివారులో మూడెకరాల సాగు భూమికి సంబంధించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకులో గతేడాది రూ.1.25 లక్షల పంట రుణం తీసుకున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ రెండో విడతలో తన పేరు లేకపోవడంతో ఆందోళన చెంది ఏవో కార్యాలయంలో సంప్రదించాడు. పట్టాపాస్‌బుక్, అకౌంట్, ఆధార్ జిరాక్స్ తీసుకువెళ్లినా రుణమాఫీ ఎందుకు జరగలేదో ఏవో చెప్పలేకపోయారు. దీంతో ఈయన నిరాశతో ఉన్నాడు.



ఈ మహిళా రైతు ధారవేణి లక్ష్మి. తాంసి మండలకేంద్రం. రెండెకరాల భూమిపై స్థానిక ఎస్‌బీఐలో రూ.1.20 లక్షల రుణం తీసుకున్నారు. రెండో విడత రుణమాఫీ తనకు వర్తిస్తుందని ఆశించారు. తీరా వ్యవసాయశాఖ విడుదల చేసిన జాబితాలో పేరు లేకపోవడంతో నిట్టూర్చారు. రుణమాఫీ జరుగుతుందో లేదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీరే కాదు.. జిల్లాలో మంగళవారం విడుదలైన రెండో విడత రుణమాఫీలో చాలా మంది తమ పేర్లు లేవని వాపోతున్నారు.



తమకు రుణమాఫీ కాలేదని కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న జైనథ్ మండల రైతులు

వివరాలే పంపలేదు..

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలానికి చెందిన 50 మందికి పైగా రైతులు మంగళవారం కలెక్టరేట్‌లో రుణమాఫీ సంబరాలు నిర్వహిస్తుండగా అక్కడికి చేరుకున్నారు. కలెక్టర్ రాజర్షి షాను కలిసి తాము రెండో విడతలో రూ.లక్షన్నర రుణమాఫీకి అర్హులైనప్పటికీ తమకు ఆ ప్రయోజనం దక్కలేదని వినతి పత్రం అందజేశారు. ఆ మండల కేంద్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఖాతాదారులైన ఆ రైతులు తమకు రుణమాఫీ దక్కలేదని మొదట వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే బ్యాంకు అధికారులు అసలు మీ వివరాలను ప్రభుత్వానికి పంపలేదని చెప్పడంతో విస్తుపోయారు. దీంతో వారు కలెక్టర్‌కు ఈ విషయాన్ని తెలియజేశారు. కలెక్టర్ రాష్ట్ర నోడల్ అధికారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు.

- మొదలైన రెండో విడత రుణమాఫీ
- తమపేరు లేదంటూ పలువురు అన్నదాతల ఆందోళన
- కలెక్టర్‌ను కలిసిన జైనథ్ మండల రైతులు
- మరికొందరు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణ

సాక్షి,ఆదిలాబాద్: రైతు రుణమాఫీకి సంబంధించి రెండో విడత నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. రూ.లక్ష నుంచి రూ.లక్షన్నరలోపు పంట రుణాలను మాఫీచేసిన సర్కారు మంగళవారం అన్నదాతల ఖాతాల్లో వాటిని జమ చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించగా జిల్లాస్థాయిలో కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. మండలాల్లోని రైతు వేదికల్లోనూ హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమాన్ని వీక్షించే ఏర్పాట్లు చేశారు. సంబరాలు నిర్వహించారు. మరోవైపు అర్హులైనా తమకు రుణమాఫీ కాలేదని పలువురు రైతులు గగ్గోలు పెడుతున్నారు. మొదటి విడతలో రూ.లక్షలోపు మాఫీ సైతం జరగలేదని పలువురు పేర్కొంటుండగా.. తాజాగా రెండో విడతలోనూ తమ పేరు గల్లంతైందని మరికొందరు వాపోతున్నారు.

రుణమాఫీ వివరాలు

మొదటి విడత	
రైతుల సంఖ్య	18,740
రుణమాఫీ నిధులు	120.46 కోట్లు
రెండో విడత..	
రైతుల సంఖ్య	17,647
రుణమాఫీ నిధులు	201.83 కోట్లు

మాఫీ కాకపోవడానికి కొన్ని కారణాలు..

జిల్లాలో 11బ్యాంకుల ద్వారా ఈ రుణమాఫీ చేపట్టారు. అయితే అర్హులైనా తమ పేర్లు జాబితాలో లేకపోవడంపై పలువురు రైతులు బ్యాంకర్లు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. తమకు రుణమాఫీ ఎందుకు కాలేదని ఆరా తీస్తున్నారు. కొన్ని మండలాల్లో వ్యవసాయ శాఖ అధికారులు రైతుల ఆధార్ నంబర్ ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసి ఖాతాలో జమ కాకపోవడానికి కారణం చెబుతున్నారు. ఇందులో ప్రధానంగా.. కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయాల్సి ఉంది.. ఇంట్లో ఒకరు ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నారు.. కుటుంబంలో ఒకరు పింఛన్‌దారు.. రుణమాఫీ మరో విడతలో ఇస్తున్నాం.. మీ డాటా దొరకలేదని.. వంటి కారణాలు కనిపిస్తున్నాయి. దీంతో రైతులు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

డీసీసీబీలో ఇలా..

రెండో విడత రుణమాఫీకి సంబంధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ పరంగా 6,308 మందికి రూ.53.91 కోట్ల రుణమాఫీ మంగళవారం చేపట్టారు. డీసీసీబీ ద్వారా రూ.2లక్షల లోపు రుణమాఫీ కోసం 49వేల మంది రైతులకు సంబంధించి రూ.490 కోట్ల కోసం వివరాలు పంపించారు. మొదటి విడతలో 12,477 మందికి రూ.63.25 కోట్లు రుణమాఫీ అయింది. దీంతో ఇప్పటివరకు డీసీసీబీలో ఉమ్మడి ఆదిలాబాద్‌కు సంబంధించి 18,785 మంది రైతులకు సంబంధించి రూ.117.16 కోట్లు రుణమాఫీ జరిగినట్లు తెలుస్తోంది.

రెండో విడత రుణమాఫీ ప్రారంభం



రైతులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: రుణమాఫీ రెండో విడత కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించగా కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. వ్యవసాయాధికారులు, ఎంపిక చేసిన రైతులు, బ్యాంకర్లు సీఎం రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. రుణమాఫీ వర్తించిన రైతులను మండలం నుంచి నలుగురిని ఎంపిక చేయగా కలెక్టర్ వారి అభిప్రాయాలు స్వీకరించారు. ప్రభుత్వతీరుపై హర్షం వ్యక్తం చేసిన అన్నదాతలు తమకు కొండంత భరోసానిచ్చారన్నారు. అనంతరం జిల్లాకు విడుదలైన నిధులతో కూడిన చెక్కును కలెక్టర్ రైతులకు అందజేశారు. అలాగే జిల్లాలోని 17 రైతు వేదికల్లోనూ మలివిడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయగా అన్నదాతలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలుచోట్ల సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

నిధుల్లో కోత విధించవద్దు : కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రుణమాఫీ ద్వారా జిల్లాలో మొదటి విడతలో 18,740 మంది రైతు కుటుంబాలకు రూ.120 కోట్ల మేర లబ్ధి చేకూర్చగా, మలివిడతలో 17,647 మందికి రూ.201 కోట్ల నిధులను వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రైతులకు విడుదలైన రుణమాఫీ నిధులను కోత విధించకుండా సక్రమంగా చెల్లించాలన్నారు. అలాగే రుణమాఫీ జరిగిన ప్రతీ రైతుకు రుణాలు రెన్యూవల్ చేయాలని ఆదేశించారు. ఖాతాల్లో నిధులు జమకాకపోయినా, సగమే డబ్బులు వచ్చినా రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అలాంటి వారు జిల్లా నోడల్ అధికారి రమేశ్‌ను 7288894003 నంబర్‌లో సంప్రదించి తమవివరాలను అందించాలన్నారు. వారి సమస్యలను 30 రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. రుణమాఫీ పొందిన రైతులు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీఏవో పుల్లయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్ కుమార్, ఏడీఏ రమేశ్‌కుమార్, టెక్నికల్ ఏఓ శివకుమార్, శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయాధికారులు,బ్యాంకర్లుతదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి



ఉత్తమ డ్రైవర్లతో ఎస్పీ గౌస్ ఆలం, రీజనల్ మేనేజర్ సోలోమన్, డిప్యూటీ ఆర్‌ఎంలు

- ఎస్పీ గౌస్ ఆలం
- ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్లకు సన్మానం

ఆదిలాబాద్: వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. ఆర్టీసీ ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆదిలాబాద్ డిపోలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రీజియన్ పరిధిలో ప్రమాద రహితంగా బస్సులను నడిపిన ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రహదారి ప్రమాదాలు అనేవి డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లనే కాకుండా ఎన్నో కారణాల వలన జరుగుతుంటాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని బస్సుల్లో ముందువైపు ప్రత్యేకంగా కెమెరాలు బిగించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పోలీస్‌శాఖ తరఫున రహదారి భద్రతకు సంబంధించి కార్యక్రమాలను పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. మరోవైపు ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ రాష్ట్రంలోని ప్రమాద రహిత రీజియన్లలో మొదటి స్థానంలో నిలవడం గొప్ప విషయమన్నారు. ఆర్‌ఎం సోలోమన్ మాట్లాడుతూ, రీజియన్ పరిధిలో కొన్నేళ్లుగా బస్సు ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయన్నారు. ఉద్యోగుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. ఉత్తమంగా నిలిచిన డ్రైవర్లను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ఇందులో డిప్యూటీ ఆర్‌ఎంలు ఎస్.ప్రణీత్, కే ప్రవీణ్, పర్సనల్ ఆఫీసర్ జిబ్లా, అకౌంట్ ఆఫీసర్ శంకరయ్య, మంచిర్యాల డిపోమేనేజర్ జనార్దన్, నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, భైంసా డిపో మేనేజర్ హరిప్రసాద్, ఆదిలాబాద్ ఎంఎఫ్ శ్రీకర్, ఆర్‌ఎం ఆఫీస్ అసిస్టెంట్‌మేనేజర్ కిరణ్‌కుమార్, డిపో సూపరింటెండెంట్ విలాస్ తదితరులు పాల్గొన్నారు.

సెల్లార్‌లోనూ వ్యాపారం!



జిల్లా కేంద్రంలోని గాంధీ ప్రింటింగ్ ప్రెస్ ఎదుట గల ఓ భవన సముదాయం, సినిమా రోడ్‌లోని ఓ భవంతి సెల్లార్‌లోనూ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. నిర్వాహకులతో పాటు వినియోగదారులు తమ వాహనాలను రోడ్డు పైన పార్కింగ్ చేస్తున్నారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.. జిల్లా కేంద్రంలో ఇలాంటి భవన సముదాయాలు పదుల సంఖ్యలోనే ఉండడం గమనార్హం.



ఆదిలాబాద్ పట్టణం గాంధీచౌక్‌లో గల ఈ షాపింగ్ కాంప్లెక్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌లో దుకాణాలు నిర్వహిస్తున్నారు. పార్కింగ్ కోసం వినియోగించాల్సిన సెల్లార్‌ను ఇలా వ్యాపారకేంద్రంగా మార్చుతున్నారు.

- నిబంధనలకు విరుద్ధంగా షాపుల నిర్వహణ
- వాహనాల పార్కింగ్‌కు తప్పని పరేషాన్
- చోద్యం చూస్తున్న బల్దియా యంత్రాంగం

కైలాస్‌నగర్: వాహనాల పార్కింగ్ కోసం నిర్మించిన సెల్లార్లను కొంత మంది భవన యజమానులు కాసులకు కక్కుర్తిపడి వ్యాపారాల నిర్వహణకు అద్దెకిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన వ్యాపారకూడళ్లు, రోడ్లను ఆనుకుని ఉన్న భవనాల్లోనే ఉండటంతో తమ వ్యాపారానికి అనువుగా ఉంటుందనే ఉద్దేశంతో పలువురు వ్యాపారులు ఇలా సెల్లార్‌లోనూ దుకాణాలు నిర్వహించేందుకు ఆసక్తి చూపుతున్నారు. షాపు యజమానులతో పాటు వినియోగదారులు సైతం తమ వాహనాలను ఆయా దుకాణాల ఎదుట గల రోడ్డుపై పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దేశ రాజధాని ఢిల్లీలోని ఓ సెల్లార్‌లో నిర్వహించిన కోచింగ్ సెంటర్‌లోకి వరదనీరు చేరి ముగ్గురు సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు మృత్యుఒడిని చేరిన విషయం విదితమే. ఆ పరిస్థితికి ఇక్కడ ఆస్కారం లేనప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లలో వ్యాపారాలు నిర్వహించడం ట్రాఫిక్ సమస్యకు కారణమవుతుంది.

నిబంధనలకు విరుద్ధంగా..

జిల్లాకేంద్రంలోని అంబేద్కర్‌చౌక్, శివాజీచౌక్, సినిమారోడ్, గాంధీచౌక్, దేవిచంద్‌చౌక్‌లు ప్రధాన వ్యాపార కేంద్రాలుగా ఉన్నాయి. వినాయక్‌చౌక్ నుంచి నేతాజీచౌక్ వరకు రోడ్లకిరువైపులా, బస్టాండ్ డౌన్‌లోనూ దుకాణాలున్నాయి. దీంతోపాటు పాత జాతీయ రహదారికి ఆనుకుని పదుల సంఖ్యలోని భవనాల్లో సెల్లార్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఆసుపత్రులు, వ్యాపార, వాణిజ్య సంబంధ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడితే సెల్లార్ తప్పనిసరిగా నిర్మించాలనే నిబంధన ఉంది. అయితే ఈ సెల్లార్‌ను పార్కింగ్ కోసమే వినియోగించాలి. కానీ ఆయా ప్రాంతాలు వ్యాపారాల నిర్వహణకు అనువుగా ఉండటంతో అక్కడ స్థలాలు కలిగిన యజమానులు నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. పార్కింగ్ కోసమే వినియోగించనున్నట్లుగా మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకుంటున్నారు. అనంతరం కాసులకు కక్కుర్తిపడి వాటిని సైతం షాపుల నిర్వహణకు అద్దెకిస్తున్నారు. దీంతో యజమానులు, వర్కర్లతో పాటు ఆయా షాపులకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను ఫుట్‌పాత్‌లపై నిలుపుతున్నారు. దీంతో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు రోడ్డు మీద ప్రమాదకరంగా నడవాల్సిన పరిస్థితి.

ఫుట్‌పాత్‌లనూ వదలట్లే..

ప్రధానచౌక్‌ల్లోని ఫుట్‌పాత్‌లను సైతం వ్యాపారులు వదలట్లేదు. దానిపైన వస్తువులను పెట్టి విక్రయాలు జరుపుతున్నారు. దీనికి తోడు డివైడర్ల నిర్మాణాలు జరుగడంతో రోడ్లు ఇరుకుగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, శివాజీచౌక్ వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. బల్దియా అధికారుల నిర్వాకమే ఇందుకు కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పార్కింగ్ కోసమే వినియోగించాలి

భవన యజమానులు సెల్లార్లను నిబంధనల ప్రకారం వాహనాల పార్కింగ్ కోసమే వినియోగించాలి. అందులో ఎలాంటి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించరాదు. పట్టణంలో 66 భవనాల్లో సెల్లార్లు ఉన్నట్లుగా గుర్తించగా అందులో కొన్నింట్లో పార్కింగ్ కోసమే వినియోగిస్తున్నారు. మరి కొన్నింటిలో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అలాంటి వారందరికీ నోటీసులు జారీ చేస్తున్నాం. వారు స్పందించి వ్యాపారాలను తొలగించాలి. లేనిపక్షంలో శాఖాపరంగా బాధ్యులపై కఠినంగా వ్యవహరిస్తాం.

– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

వన మహోత్సవ లక్ష్యం పూర్తిచేయాలి

- ఏజెన్సీలో వైద్యశిబిరాలు నిర్వహించాలి
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ రాజర్షి షా



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తిచేసేలా మొక్కలు నాటాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీఎంలతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వనమహోత్సవంలో భాగంగా జిల్లాకు 44.06 లక్షల మొక్కలు నాటే లక్ష్యం నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 19 లక్షల11వేల మొక్కలు నాటినట్లు తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున మిగతా లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కోసం ఉపయోగపడేలా మునగ, చింత, కరివేపాకు తదితర మొక్కలు నాటాలన్నారు. అలాగే నాటిన ప్రతి మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలని, జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న దృష్ట్యా ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో శానిటేషన్‌పై శ్రద్ధ వహించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. ఇందులో ట్రెయినీ కలెక్టర్ అభిఘ్యాన్ మాల్వీయా, జెడ్పీ సీఈవో రత్నమాల, డీఆర్డీవో సాయన్న వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని కొలాం బాలుర ఆశ్రమ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల రిజిస్టర్లను పరిశీలించారు. అనారోగ్యంతో సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. వంట గదితో పాటు సరుకులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఫ్యాన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

'బీసీ' నిధుల కోటా పెంచాలి

- కలెక్టరేట్ వద్ద బీజేపీ ఆందోళన

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో బీసీలకు తగినంత నిధులు కేటాయించలేదని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. నిధుల కోటా పెంచాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట నిరసన చేపట్టిన నాయకులు, కార్యకర్తలు కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు సమావేశ మందిరం వద్దకు చేరుకున్నారు. అయితే కలెక్టర్ రుణమాఫీ కార్యక్రమంలో ఉండటంతో అక్కడ బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. లోనికి చొచ్చుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. కార్యక్రమ అనంతరం బయటకు వచ్చిన కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు యత్నించగా తన చాంబర్‌కు రావాలని కలెక్టర్ వారికి సూచించారు.తాము అప్పటికే రెండు గంటల పాటు వేచి ఉన్నామని వినతిపత్రం స్వీకరించాలని కోరారు. కలెక్టర్ ససేమిరా అనడంతో నాయకులంతా చేతులు జోడించి వినతిపత్రం స్వీకరించాలని ప్రాధేయపడ్డారు. చివరకు వినతిపత్రం స్వీకరించడంతో వారు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు.ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, పట్టణాధ్యక్షుడు లాలామున్నా, నాయకులు పాయల్ శరత్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ సమావేశ మందిరం ద్వారం వద్ద బైఠాయించిన నాయకులు,కార్యకర్తలు

క్లుప్తంగా

పాముకాటుతో వృద్ధురాలు మృతి



అరుగుల గంగమ్మ మృతదేహం

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లెకు చెందిన అరుగుల గంగమ్మ (65)మంగళవారం పాముకాటుతో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం వృద్ధురాలు నివాసం ఉంటున్న ఇంట్లోనే పాముల పుట్ట ఉంది. పలుమార్లు పుట్టలోంచి బయటకు వచ్చిన పాము పరిసరాల్లో సంచరిస్తూ ఉండేది. సోమవారం ఇంటిని శుభ్రం చేసే క్రమంలో పుట్టవద్ద శుభ్రం చేస్తుండగా నాగుపాము బయటకు వచ్చి వృద్ధురాలిని కాటువేసింది. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమార్తె రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బాసర: మండల కేంద్రంలోని నిజామాబాద్ నుండి భైంసా వెళ్లే ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని న్యాయగాం గ్రామానికి చెందిన లక్ష్మణ్ (46) ద్విచక్ర వాహనంపై న్యాయగాం నుంచి నిజామాబాద్ వెళ్తుండగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గమనించి పోలీసులతో పాటు 108కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

విద్యుత్‌షాక్‌తో విద్యార్థి ..



కార్తీక్ (ఫైల్)

గుడిహత్నూర్: విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గురుజ గ్రామానికి చెందిన దశరథ్, నీలాబాయి దంపతుల కుమారుడు జాదవ్ కార్తీక్ (17) మంగళవారం గ్రామానికి సమీపంలో ఉన్న తమ బంధువుల పంటచేనులోకి వెళ్లాడు. చేనుకు వేసిన కంచె దాటుతుండగా అప్పటికే కంచెపై పడి ఉన్న విద్యుత్ తీగను పట్టుకోవడంతో షాక్‌కు గురై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

కుక్కల దాడిలో దూడ మృతి

ముధోల్: మండల కేంద్రంలోని మాధవ్‌నగర్‌కు చెందిన నారాయణ్‌సింగ్ దూడ సోమవారం కుక్కల దాడిలో మృతి చెందింది. కొట్టంలో ఉన్న దూడపై రాత్రి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. గేదె అరుపులు విన్న స్థానికులు కుక్కల దాడినుంచి దూడను రక్షించి యజమానికి సమాచారం అందించారు. గ్రామంలో కుక్కల దాడులు ఎక్కువవుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో గల రామాలయం, పొచ్చమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. రామాలయంలోని హుండీలో నుంచి రూ.4వేలు, పొచ్చమ్మ ఆలయంలోని హుండీలో నుంచి రూ.7,200 నగదును ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఆయా ఆలయ కమిటీల అధ్యక్షుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

ఆర్టీసీకి 'మహాలక్ష్మి'

- పథకంతో సంస్థకు పెరిగిన ఆదాయం
- గణనీయంగా పెరిగిన మహిళా ప్రయాణికులు



జీరో టికెట్ తీసుకుని ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థినులు (ఫైల్)



ఆదిలాబాద్ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తున్న మహిళలు, విద్యార్థినులు (ఫైల్)

ఆదిలాబాద్:గతంలో ప్రయాణికులు లేక వెలవెల బోయిన ఆర్టీసీ బస్సులు నేడు కళకళలాడుతున్నాయి. మహిళా ప్రయాణికులను గౌరవిస్తూ, వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళల కోసం ప్రత్యేకంగా సీట్ల కేటాయింపు ఉంది. అయితే వారికి కేటాయించిన సీట్లే కాకుండా బస్సులో 90 శాతం వరకు ప్రస్తుతం మహిళలే ప్రయాణిస్తుండడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలందరికీ ఉచిత ప్రయాణం అందించాలని నిర్ణయించింది. వయసుతో సంబంధం లేకుండా బాలిక నుంచి వృద్ధురాలి వరకు ప్రతి ఒక్కరూ ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. దీంతో ప్రజారవాణా సంస్థకు మహిళా ప్రయాణికుల తాకిడి పెరగడంతోపాటు, ఆదాయం సైతం పెద్ద మొత్తంలో సమకూరుతోంది.

నిర్మల్ టాప్..

మహాలక్ష్మి పథకం వినియోగానికి సంబంధించి రీజియన్ వ్యాప్తంగా పరిశీలిస్తే నిర్మల్ డిపోలో అధికంగా లబ్ధిదారులు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జూలై 21 వరకు 1.48 కోట్ల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. డబ్బులు చెల్లించి ప్రయాణించిన వారు 51.59 లక్షల మంది ఉండగా జీరో టిక్కెట్ తీసుకున్న మహిళలు 96.54 లక్షల మంది ఉన్నారు. దాదాపుగా రెట్టింపు సంఖ్యలో మహిళలు ప్రయాణిస్తున్నారు. ఇక మంచిర్యాలలో 78 లక్షలు, ఆదిలాబాద్‌లో 59 లక్షలు, భైంసాలో 56 లక్షలు, ఆసిఫాబాద్‌లో 49, ఉట్నూర్ పరిధిలో 16 లక్షల మంది అతివలు, బాలికలు ప్రయాణం చేశారు. ఇక ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) విషయానికి వస్తే భైంసా డిపోలో అధికంగా 96 శాతం, నిర్మల్‌లో 94 శాతం, ఆసిఫాబాద్‌లో 89 శాతం, మంచిర్యాలలో 88 శాతం, ఆదిలాబాద్‌లో 86 శాతం, ఉట్నూర్‌లో 85 శాతంగా ఓఆర్ నమోదైంది. రీజియన్ పరిధిలో మొత్తంగా 90 శాతం ఓఆర్ నమోదు కావడంతో 'మహాలక్ష్మి ఎఫెక్ట్' అని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

బస్సుల కోసం మరిన్ని విజ్ఞప్తులు..

మహాలక్ష్మి పథకం ప్రారంభం కావడంతో పలు గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు డిపో మేనేజర్లకు వినతి పత్రాలు అందజేస్తున్నారు. గతంలో బస్సులు నిలిపివేసిన రూట్లలో సైతం బస్సులు పునరుద్ధరించాలని డిమాండ్లు వస్తున్నాయి. అదేవిధంగా నూతన మార్గాల్లోనూ సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సైతం విన్నవిస్తున్నారు. దీంతో ఈ దిశగా బస్సుల సంఖ్య పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 2023 డిసెంబర్ 15 నుంచి 2024 జూలై 21 వరకు వచ్చిన ఆదాయం

డిపో	ఆదాయం (రూ.కోట్లలో)	జీరో టికెట్ ఆదాయం (రూ.కోట్లలో)	టికెట్ తీసుకోవడంతో వచ్చిన ఆదాయం(రూ.కోట్లలో)
ఆదిలాబాద్	6.19	2.18	4.39
ఆసిఫాబాద్	4.21	1.66	2.81
భైంసా	3.20	1.74	1.61
మంచిర్యాల	7.44	3.00	4.90
నిర్మల్	7.78	3.43	4.92
ఉట్నూర్	1.36	52 లక్షలు	88 లక్షలు
మొత్తం	30.20	12.55	19.53

ఇబ్బందులు లేకుండా చర్యలు



ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రతీ వందమందిలో 55 మంది మహిళలే ఉంటున్నారు. రద్దీ, విజ్ఞప్తులు ఉన్న రూట్లలో ఉన్న బస్సు సర్వీసులను అడ్జస్ట్ చేస్తూ నడుపుతున్నాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా ప్రధానమైన రూట్లలో బస్సులు రద్దు చేయకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. బస్సుల్లో రద్దీ పెరుగుతున్న దృష్ట్యా మహాలక్ష్మి ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలి. బస్సులు ఎక్కి, దిగేటప్పుడు హడావుడి పడకుండా నెమ్మదిగా వ్యవహరించాలి.

– సోలోమన్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

విద్యారంగంలో కీలక పాత్ర

- ప్రైవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్



మాట్లాడుతున్న మధుసూదన్

నిర్మల్‌ఖిల్లా: విద్యారంగంలో తమవంతు పాత్ర పోషిస్తున్నామని ప్రైవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేలాది మంది నిరుద్యోగులు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తూ ఉపాధ్యాయులుగా ఉపాధి పొందుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆరు వేల ప్రైవేటు పాఠశాలల్లో దాదాపు 32 లక్షల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారని, ఇందుకు తాము అందిస్తున్న నాణ్యమైన విద్యనే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్‌రావు, కోశాధికారి పి.రాఘవేంద్రరావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, పట్టణ కార్యదర్శి శ్యాంసుందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో గావ్‌సాత్ పూజలు



పోచ్చమ్మ దేవతకు మొక్కుతున్న గిరిజనులు



గావ్‌సాత్ పూజలకు వెళ్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో గావ్‌సాత్ పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం పొల్లుగూడ, కేస్లాపూర్ ఆదివాసీలు గ్రామ పొలిమేరకు వెళ్లి పోచ్చమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోచ్చమ్మ దేవతకు పూజలు చేయడం ద్వారా గ్రామానికి ఎలాంటి కీడు రాదని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉంటారని నమ్ముతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు మెస్రం వెంకట్‌రావ్, జుగ్నాక్ మహదు, కోరెంగా లింగు, ఆత్రం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కడెం అడవుల్లో శిక్షణ ఎఫ్‌బీవోలు



కల్పకుంట వాచ్ టవర్ వద్ద శిక్షణ ఎఫ్‌బీవోలు

కడెం: హైదరాబాద్ దూలపల్లి అటవీ అకాడమీకి చెందిన 45 మంది శిక్షణ ఎఫ్‌బీవోలు మంగళవారం కడెం అడవుల్లో పర్యటించారు. మండలంలోని ఉడుంపూర్ అటవీరేంజ్ పరిధిలోని కల్పకుంట వాచ్ టవర్‌ను సందర్శించి, గడ్డి క్షేత్రాలను పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. కల్లెడ డెప్యూటీ రేంజ్ అధికారి డి.ప్రకాశ్ వారికి సహజ, కృత్రిమ పద్ధతులతో గడ్డి క్షేత్రాల పెంపకం, అటవీ ప్రాంతంలో పక్షుల రకాలను గురించి వివరించారు. ఎఫ్‌బీవో ప్రసాద్ గడ్డి జాతులు, వాటి పేర్లను వివరించారు. వారి వెంట అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్ (ఏసీడీ) సుభాష్, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

వాగు దాటి.. వైద్య శిబిరం



వాగుదాటి ఉమ్రి చిత్తగూడ వెళ్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించింది. వాగులు వంకలు పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది రాథోడ్ రవీందర్, ఏఎన్ఎం శ్రీదేవి, హెచ్‌ఏ వినోద్ వాగు దాటి దాదాపు రెండు కిలోమీటర్లు బురదరోడ్డుపై కాలినడకన వెళ్లి ఉమ్రి చిత్తగూడలో వైద్యశిబిరం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ సీజనల్ వ్యాధులపై ఆరా తీశారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సదరు సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాథోడ్ నరేందర్ అభినందించారు.

బాలకేంద్రం చిన్నారుల ప్రతిభ



బాలకేంద్రం చిన్నారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాలకేంద్రానికి చెందిన చిన్నారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెన్నెల డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక నృత్య పోటీల్లో శాస్త్రీయ, జానపద, వెస్ట్రన్ విభాగాల్లో ప్రతిభ కనబర్చారు. కూచిపూడి బృంద నృత్యం, సబ్ జూనియర్స్, సోలో విభాగాల్లో ప్రథమ బహుమతి సాధించారు. మూషికవాహన గీతంపై ఇతీక్ష, మమతా గోరేకర్ దేవిస్తుతిపై నృత్య ప్రదర్శన చేసి ప్రథమ స్థానంలో నిలిచారు. నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ బహుమతులు ప్రదానం చేశారు.

రిజర్వు ఫారెస్ట్‌లో చెట్లు నరికిన ఇద్దరి అరెస్ట్

సారంగపూర్: మండలంలోని జౌళి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో చెట్లు నరికిన ఇద్దరు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు డీఆర్‌ఓ శ్రీదేవి తెలిపారు. గతంలో స్వర్ణ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ పక్కనే గల ఫారెస్ట్ భూమిలో మొక్కలు నాటామని అన్నారు. అయితే ఇందులో తమ సాగు భూములున్నాయని, తాత ముత్తాతల నుంచి తామే పంటలు పండిస్తున్నామని గ్రామానికి చెందిన బండారి సాయన్న, కొత్తపాటి చిన్నగంగయ్య అటవీభూమిలోకి వచ్చి చెట్లు నరికారన్నారు. విషయం తెలుసుకున్న తాము సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి డీఎఫ్‌ఓ ఎదుట హాజరు పరిచామన్నారు. తమ వాళ్లను వదిలేయాలని గ్రామానికి చెందిన సదరు వ్యక్తులు జిల్లా అటవీశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఇదే భూమిలో 14 మందికి పట్టాలు..

ఇటీవల పోడుపట్టాల పంపిణీ సమయంలో పంచాయతీ కార్యదర్శులు, అటవీ శాఖ అధికారులు నిర్వహించిన సర్వే సమయంలో ఇదే భూమిలో గ్రామానికి చెందిన దాదాపు 14 మంది ఫొటోలు దిగి భూమిని సర్వే చేయించారు. సర్వే వివరాలను పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్ చేయగా ఇదే భూమిలోంచి 14 మంది రైతులకు పట్టాలు జారీ చేసినట్లు సమాచారం. అయితే అప్పటికీ ఏఒక్క రైతు సదరు భూముల్లో సాగుపనులు చేయకపోవడం, అప్పటికే చెట్లు ఏపుగా పెరిగిపోవడం గుర్తించిన అటవీశాఖ అధికారులు సదరు పట్టాలను అప్పటి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిలుపుదల చేశారని తెలుస్తోంది. ఐ

మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య



కనక శేఖర్ (ఫైల్)

పెంబి: మద్యం మత్తులో పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని జంగుగూడ గ్రామానికి చెందిన కనక భీంబాయి, సోము దంపతుల మూడో కుమారుడైన కనక శేఖర్ (22) మేకల కాపరిగా పనిచేసేవాడు. ఈక్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం మేకలు మేపేందుకు వెళ్లనని తండ్రితో చెప్పి మద్యం సేవించాడు. అదే మత్తులో కొట్టంలో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన తండ్రి సోము ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి కనక సోము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ తెలిపారు.

తాంసిలో డెంగీ కేసు నమోదు



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

తాంసి: ప్రజలు దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తాంసి హెల్త్ సూపర్‌వైజర్ తులసీరాం సూచించారు. మండల కేంద్రంలో డెంగీ కేసు నమోదు కావడంతో మంగళవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యసిబ్బందితో పాటు పంచాయతీ సిబ్బందితో కలిసి డెంగీ బారిన పడిన వ్యక్తి ఇంటిని పరిశీలించారు. సదరు వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంటి పరిసరాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి గంగన్న, ఎల్‌టీ రమణాచారి, ఏఎన్ఎం లక్ష్మి ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల నుంచి ఫేక్ కాల్

బోథ్: 'మేము హైదరాబాద్ డ్రగ్స్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ బాబు డ్రగ్స్ కేసులో దొరికాడు. వెంటనే జైల్లో వేస్తాం. మీ బాబును కాపాడుకోవాలంటే వెంటనే రూ.5 లక్షలు పంపాలి.' అంటూ బోథ్ మండల కేంద్రంలోని పలువురితో పాటు పాచ్చెర గ్రామానికి చెందిన ఇద్దరికి సైబర్ నేరగాళ్ల నుండి మంగళవారం వాట్సాప్ కాల్‌లు వచ్చాయి. తమ వద్ద అంతలేవని చెప్పడంతో రూ.50 వేలు గూగుల్‌పే ద్వారా పంపాలని సూచించాడు. పాచ్చెర గ్రామానికి చెందిన వ్యక్తి కుమారుడు ఇంట్లోనే ఉండటంతో వచ్చిన కాల్ ఫేక్ అని సదరు వ్యక్తి గుర్తించాడు. మిమ్మల్ని కలిసి డబ్బులిస్తానని పేర్కొనగా సైబర్ నేరగాడు ఫోన్‌ను వెంటనే కట్ చేశాడు. బోథ్ మండల కేంద్రంలోని పలువురికి ఇలానే ఫోన్లు రావడంతో అప్రమత్తమైన వారు స్పందించలేదు. ఫేక్ కాల్, సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై రాము సూచించారు.

విభునాయర్‌ను కలిసిన తిరుపతి



పుష్పగుచ్ఛం ఇస్తున్న తిరుపతి

ఇచ్చోడ: తెలంగాణ రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (జీసీసీ) చైర్మన్ కోట్నాక్ తిరుపతి మంగళవారం ఢిల్లీలో మినిస్టర్ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ సెక్రటరీ విభునాయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిజనుల అభివృద్ధికి కేంద్రం నుంచి సహకారం అందించాలని కోరారు. ఇందుకు సెక్రటరీ సానుకూలంగా స్పందించినట్లు తిరుపతి 'సాక్షి'కి వివరించారు.

వివాహిత ఆత్మహత్య



సుజాత (ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన గౌర్ల సుజాత మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మేకల పోసాని పెద్దభూమన్న కుమార్తె సుజాతకు అదే గ్రామానికి చెందిన గౌర్ల అనిల్‌తో 2020లో వివాహమైంది. పెళ్లిలో రూ.7లక్షలు కట్నంగా ఇచ్చారు. కొన్ని రోజులుగా మరో రూ.3 లక్షలు తేవాలని మేలో ఇంటినుంచి పంపించేశారు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగింది. చుట్టుపక్కల వారు గమనించి 108లో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

జలపాతాల్లో జల్సాలకు చెక్



సాక్షి స్పందన

'జలపాతాల్లో జల్సాలు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు మామడ మండల పోలీసులు వాస్తాపూర్ జలపాతం వద్ద పరిస్థితిని పరిశీలించారు. పర్యాటకులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని మామడ ఎస్సై సందీప్ తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

సర్కారు వైద్యం.. వసతి దైన్యం



ఇటీవల కురిసిన వర్షాలతో ఆదిలాబాద్ జిల్లాలో సీజనల్ వ్యాధుల తీవ్రత పెరిగింది. దీంతో జిల్లాలోని పేద ప్రజలకు పెద్దదిక్కుగా నిలిచే రిమ్స్ ఆస్పత్రిలో రోగుల సంఖ్య భారీగా పెరుగుతోంది. దీంతో బెడ్స్ సరిపోకపోవడంతో ఒకే బెడ్‌పై ఇద్దరు ముగ్గురేసి రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఒకరు పడుకుంటే మరొకరు కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యాధుల నయం మాట అటుంచితే కొత్త రోగం సోకే అవకాశం లేకపోలేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్